నేడు ఉచిత వైద్య శిబిరం

మణికొండ: బంజారాహిల్స్, మణికొండలలో ఉన్న డాక్టర్ ప్రభు మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్‌ల ఆధ్వర్యంలో శనివారం మణికొండ లక్ష్మీప్రియ కాలనీలోని క్లినిక్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలి తెలిపారు. షుగర్, బీపీ, లివర్ ఫైబ్రో స్కానింగ్, కంటి, దంత పరీక్షలను ఉచితంగా చేస్తామన్నారు. మణికొండ మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



మణికొండ: అగ్నిప్రమాదాలు ఎలా జరుగుతాయి.. వాటిని ఎలా నివారించాలనే విషయంపై గండిపేటలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ), చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలల్లో శుక్రవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. వట్టినాగులపల్లిలోని అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో రెండు కళాశాలల్లో సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినపుడు లిఫ్టలను వాడరాదని, ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవటంతో పాటు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్‌లు సి.వి.నరసింహులు, జి.చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని.. తద్వారా పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్‌లోని కాళికానగర్ కాలనీ, 21వ డివిజన్‌లోని సాయిబాబానగర్ కాలనీ, 22వ డివిజన్‌లోని దుర్గాదేవి కాలనీలలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తడి, పొడి, హానికారక చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. ప్రజలు తమ ఇంట్లోని చెత్తను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు సుభాష్, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సత్కారం



ర్యాలీలో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తదితరులు

రాజేంద్రనగర్: టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపోలో డ్రైవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ బుద్వేల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీని రాజేంద్రనగర్ డిపో నుంచి డైరీఫామ్ చౌరస్తా వరకు నిర్వహించారు. డ్రైవర్లకు గులాబీ పూలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తమ పూర్తి సర్వీసులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవింగ్ చేసిన డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. ర్యాలీలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలాజీ, ట్రాఫిక్ ఎస్ఐ జి.రాజేందర్ గౌడ్, ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జడ్పీహెచ్ఎస్ బుద్వేల్ హెచ్ఎం కె.ఎల్.ఝాన్సీరాణి, ఇన్‌చార్జి జి.శ్రీనివాస్‌రావు, డిపో మేనేజర్ బద్రీనారాయణ, మెకానికల్ ఇంజినీర్ నీలిమ, ఎస్టీఐ సుశీల, రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు, పాఠశాల విద్యార్థులు, రాజేంద్రనగర్ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వికాస్‌సింగ్

మైలార్‌దేవ్‌పల్లి: ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ యువకుడు కనిపించకుండా పోయిన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... కాటేదాన్ బుద్వేల్ స్టేషన్ ప్రాంతానికి చెందిన వికాస్‌సింగ్(25) ఈ నెల 18వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద ఆచూకీ కోసం వెతికారు ఫలితం లేనందున మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వికాస్‌సింగ్ ఆచూకీ తెలిసిన వారు ఫోన్స్: 94906 17459, 78931 91862, 98490 617267లలో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



నమ్రు తేస్‌ద్వివేది

రాజేంద్రనగర్: పరీక్షలు దగ్గర పడ్డాయి... పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయి... బుద్ధిగా చదువుకోవాలని తల్లి మందలించడంతో ఇంటర్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. రాజేంద్రనగర్ ఎస్ఐ మామిడి కిశోర్ సమాచారం మేరకు... భవానీకాలనీ ప్రాంతానికి చెందిన రాజ్‌మన్ ద్వివేది కుమారుడు నమ్రు తేస్‌ద్వివేది(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయి. దీంతో తల్లి గురువారం ఫైనల్ పరీక్షలు దగ్గరకు వచ్చాయని... మంచిగా చదువుకోవాలని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన నమ్రు తేస్‌ద్వివేది ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సందడిగా పశుసంక్రాంతి

వందలాది పశువుల రాకతో కిటకిటలాడిన జాతర

- రూ. లక్షల్లో ధర పలికిన ఆవులు, గేదెలు
- ప్రధాన ఆకర్షణగా నిలిచిన పుంగనూరు ఆవులు



ఆవులకు పూజలు చేసి జాతరను ప్రారంభించిన చైర్మన్, వైస్ చైర్మన్‌లు

మణికొండ: నార్సింగి మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం పశుసంక్రాంతి జాతర సందడిగా సాగింది. వందలాదిగా తరలించిన ఆవులు, గేదెలు, పుంగనూరు ఆవుల క్రయవిక్రయాలతో జాతర ఆద్యంతం నేత్రపర్వంగా జరిగింది. పుంగనూరు ఆవులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

- నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు గోవులు, గేదెలకు పూజలు నిర్వహించి పశు సంక్రాంతి జాతరను ప్రారంభించారు.
- గుజరాత్, హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రా ష్ట్రాల నుంచి గేదెలు, ఆవులను అందంగా ముస్తాబు చేసి అమ్మకానికి పెట్టా రు. వాటి ధరలు ఏకంగా రూ. 50 వేల నుంచి మొదలుకుని రూ. 4 లక్షల వరకు ధరలు పలికాయి.
- షాబాద్ మండలం సంకెపల్లిగూడకు చెందిన సాయికృష్ణారెడ్డి అనే పాల వ్యాపారి మాత్రం దులియా జాతికి చెందిన రెండు ఒక్కొక్కటి రూ. 2.05 లక్షల చొప్పున కొనుగోలు చేశారు.
- పలువురు పాడి వ్యాపారులు రూ. లక్షలు పెట్టి వారికి నచ్చిన గేదెలు, దేశీ, జెర్సీ ఆవులను కొనుగోలు చేశారు.



పశుసంక్రాంతిలో పాల్గొన్న జైపాల్‌రెడ్డి, చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు, డైరెక్టర్‌లు

- నిజాం కాలం నుంచి ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ తరువాత వచ్చే రెండవ శుక్రవారం పశు సంక్రాంతిని నిర్వహిస్తారు. పంటలను అమ్మగా వచ్చిన డబ్బుతో రైతులు పాడిపశువులను కొనుగోలు చేస్తారనే ఉద్దేశంతో మొదలైన పశుసంక్రాంతి ఒరవడి నేటికీ కొనసాగుతోంది.
- ఇదిలా ఉండగా... జిల్లాలో భూముల ధరలు పెరిగిపోవటం, వ్యవసాయం, డైయిరీల నిర్వాహకులు తగ్గిపోవటంతో పశువుల కొనుగోలుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. వాటిని కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ నగరంతో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చే పాడి వ్యాపారులు రాకపోవటంతో ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగలేదనే చెప్పొచ్చు. ప్రతి సంవత్సరం బ్యాండు, డప్పు చప్పుళ్లతో వాటిని ఊరేగించి విక్రయాలు చేసే ప్రక్రియకు తిలోదకాలు ఇవ్వడం పశుప్రేమికులను నిరాశకు గురిచేసింది.
- పశు సంక్రాంతిలో నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.దశరథయాదవ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కౌన్సిలర్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శంషాబాద్ అభివృద్ధిపై సమీక్ష

ముగిసిన చివరి కౌన్సిల్ సమావేశం



కౌన్సిలర్లు సంజయ్, వెంకటేష్‌లను సన్మానిస్తున్న దృశ్యం

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ చివరి కౌన్సిల్ సమావేశాన్ని చైర్ పర్సన్ సుష్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. పలు వార్డుల్లో శంకుస్థాపనలు చేసిన పనులు ఇంకా పూర్తి కాలేదని పలువురు కౌన్సిలర్లు గుర్తు చేశారు. పాలకవర్గ సమయంలో ఆస్పత్రి, మార్చురీ నిర్మాణాలను పూర్తి చేయలేకపోవడం కొంత లోటుగానే అనిపిస్తోందని కౌన్సిలర్ సంజయ్‌యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ ఎంపీ రంజిత్‌గౌడ్‌లు అందించిన సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తి చేసుకోగలిగామన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లందరికి ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేసి శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కమిషనర్ సుమన్‌రావు కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్, వై.కుమార్, జహంగీర్‌ఖాన్, రేఖ, అజయ్, లక్ష్మీ, లావణ్య, విజయలక్ష్మీ, మస్రత్‌జా, అశోక్, కొండ ప్రవీణ్‌గౌడ్, భారతమ్మ, పుష్పలత, భాగ్యలక్ష్మీ, రాణి, సునీత, భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నీటి సమస్య పరిష్కారం



బోరు పనులను పరిశీలిస్తున్న క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వసతుల కల్పనకు చొరవచూపడం అభినందనీయని పాఠశాల హెచ్ఎం ఎస్.అనిత పేర్కొన్నారు. నీటి వసతి లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్యను నవయువ యూత్ క్లబ్ దృష్టికి తీసుకురావడం ద్వారా స్థానిక నాయకులు సంతోష్‌గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పూర్తిస్థాయి పరిష్కారం లభించిందన్నారు. రెండు సంవత్సరాలుగా విద్యార్థులు నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన బోరు మాత్రమే కాకుండా కమ్యూనిటీ హాల్ దగ్గర ఉన్న బోరును కూడా అందుబాటులోకి తెచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో అలరిస్తున్న ఎగ్జిబిషన్



చీరలను కొనుగోలు చేస్తున్న మహిళలు

మణికొండ: మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్ గార్డన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న చేనేత వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. దేశ వ్యాప్తంగా కళాకారులు రూపొందించిన దుస్తులు, గృహోపకరణ వస్తువులు, వివిధ కళాకృతులు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయి. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులు ఉన్నాయి. పలు రాష్ట్రాల్లోని కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యతతో లభిస్తుండటంతో కొనుగోలుదారులు ఆదరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్‌ను మణికొండ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



కంప్యూటర్లు, ప్రింటర్లను అందించిన ఐడీబీఐ కోఆర్డినేటర్, అధికారులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులను ఐటీ సంస్థలు, సేవా సంస్థలు తమ వంతుగా ఆదుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు ఐడీబీఐ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో కంప్యూటర్లు, ప్రింటర్లను శుక్రవారం అందజేశారు. కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సౌకర్యాలను కల్పిస్తున్నా మరికొన్ని వసతులను ఇలాంటి సంస్థలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను మున్సిపాలిటీల నుంచి అనేకం కల్పించామన్నారు. ఐడీబీఐ బ్యాంక్ కో ఆర్డినేటర్ విశ్వనాథ్ ప్రభు, బ్యాంక్ మేనేజర్ వీరరాజు, సిబ్బంది అఖిలేష్, జైసింగ్, ప్రధానోపాధ్యాయులు నిరంజన్, దశరథనాయక్, నాయకులు బి.శ్రీరాములు, శ్రవణ్‌కుమార్, సి.బీరప్ప, రవికాంత్‌రెడ్డి, ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండ్లగూడ ప్రజలకు స్వచ్ఛమైన నీరు

- జాగీర్ పరిధిలో తాగు నీటి హామీని నెరవేరుస్తాం
- మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్



హిమాయత్‌సాగర్ ఫిల్టర్స్‌కు నీటిని ట్రయల్ రన్ చేపడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్ తదితరులు


బండ్లగూడ: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం తమ బాధ్యత అని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. హిమాయత్‌సాగర్‌లో ఏర్పాటు చేస్తున్న ఫిల్టర్ గ్రిట్స్ పనులు పూర్తి అయిన నేపథ్యంలో హిమాయత్‌సాగర్ నుంచి ఫిల్టర్స్‌కు వచ్చే నీటిని ట్రయల్ రన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మేయర్‌గా బాధ్యతలు స్వీకరించే సమయంలో ఎనిమిది నెలల కాలంలో ఈ కార్పొరేషన్ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తుచేశారు. చిన్న చిన్నపైపు జాయింటింగ్స్‌లు చిన్న చిన్న పనులు ఉన్నాయన్నారు. అవన్నీ త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. హిమాయత్‌సాగర్ నుంచి ప్యూర్ అండ్ సేఫ్ వాటర్‌ని కార్పొరేషన్ ప్రజలకు అందించబోతున్నామని స్పష్టం చేశారు. దీనికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, ఫహీంలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

16 గంటలపాటు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన ఓ కారు విద్యుత్ స్తంభంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో వాహనం నడుపుతున్న వ్యక్తి బయటపడ్డాడు. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం విరిగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో విద్యుత్ సరఫరాలో నిలిచిపోయింది. దాదాపు 16 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాజేంద్రనగర్ పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కిస్మత్‌పూర్ పోచమ్మ దేవాలయం ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు వేగానికి ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వాహనం వేగంగా ఢీకొట్టడంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయని... అనంతరం అతను అక్కడి నుంచి పారిపోయాడని స్థానికులు వెల్లడించారు. తెల్లవారుజామున 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కిస్మత్‌పూర్ సెక్షన్ విద్యుత్ శాఖ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



కొండయ్య (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నల్లగొండ జిల్లాకు చెందిన కొండయ్య(36) కుటుంబ సభ్యులతో కలిసి న్యూ మారుతీనగర్‌లో జీవిస్తున్నాడు. ఈ నెల 23వ తేదీన లక్ష్మీగూడలోని వరుణ్ స్టీల్స్ షాప్‌లో స్టీల్ దింపే పని ఉండటంతో స్థానికులైన పర్వతాలు, కొండల్‌తో కలిసి పనికి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో లోడ్ దింపుతుండగా కరెంట్ షాక్‌కు తగిలి కొండయ్య కిందపడిపోయాడు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి గురై మృతి చెందిన కొండయ్య కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు ఆందోళనకు దిగారు. పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో రోడ్డుపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరుణ్ స్టీల్స్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కొండయ్య మరణించాడని ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని సముదాయించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

మణికొండ: తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం ద్వారా పర్యావరణానికి తద్వారా మానవాళి పెను ప్రమాదం ఖాయమని నార్సింగి పురపాలక సంఘం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం పేర్కొన్నారు. తక్కువ మందం ఉన్న కవర్లను వినియోగించవద్దని.. అలాంటి దుకాణాలదారుపై చర్యలు తథ్యమని ఆయన హెచ్చరించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాలతో మంచిరేవుల, కోకాపేటలలో షాపులలో తనిఖీలు నిర్వహించారు. 45 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. పలు షాపుల యజమానులకు రూ. 5 వేల ప్రకారం జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో తరచూ ప్లాస్టిక్ డ్రైవ్‌లను నిర్వహిస్తామని, రెండవ సారి దొరికిన వారి షాపుల లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. మున్సిపల్ సిబ్బంది వంశీ, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.